క్లుప్తంగా

వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని వెంకటాద్రినగర్ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణిలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని, చిన్నారులకు నిమోనియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గర్భిణిలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు.

గొందిపర్లలో విగ్రహ ప్రతిష్ఠ

కర్నూలు సిటీ: గొందిపర్ల గ్రామంలోని శ్రీకల్యాణ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శనివారం శిఖర, ధ్వజస్తంభం, నవగ్రహ, నాభిశిల, నాగమయ్య విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. గ్రామంలో మొదటి నుంచి ఆధ్యాత్మిక వాతావరణం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన పెద్దలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోండి




పీఎస్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను నగర ప్రజలు వినియోగించుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. శనివారం నగరంలోని వివిధ పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు క్రిస్టఫర్ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చెరువుకు నీరు విడిపించండి

కోడుమూరు: బి.తాండ్రపాడు చెరువుకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు విడిపించాలని మాజీ సర్పంచు ఈశ్వరయ్య, ఎంపీటీసీ హనుమంతు, గ్రామస్తులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి కోరారు. శనివారం కోట్ల హర్ష నివాసానికి వెళ్లి తాండ్రపాడులో నెలకొన్న సమస్యలను వివరించారు. ఇందుకు కోట్ల హర్ష జిల్లా కలెక్టర్‌ను కలిసి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు కేశవరెడ్డి, బొజ్జన్న, ప్రభుదాసు, రంగారెడ్డి, దావీదు, బైరాపురం క్రిష్ణ, తదితరులు కుడా చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

తలసీమియా చిన్నారులకు రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తలసీమియా తో బాధపడుతున్న చిన్నారుల కోసం శనివారం రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొలిన్ నుస్సి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ మనిషిని బతికించవచ్చన్నారు. కరస్పాండెంట్ సిస్టర్ రాజమ్మ, కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ శ్రీకాంత్, డాక్టర్ అపర్ణ, అక్షయ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్: ఎనిమల్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ఎనిమల్, భగవంత్ కేసరి, కాలింగ్ సహస్ర, శ్యామ్ బహదూర్, అథర్వ, బ్రీత్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఎనిమల్, విక్రమ్ రాథోడ్, ఆది కేశవ
ఐనాక్స్: శ్యామ్‌బహదూర్, కోటబొమ్మాళి పీఎస్, అథర్వ, టైగర్ 3, ఉపేంద్ర గాడి అడ్డా, బ్రీత్
భరత్ కాంప్లెక్స్ : ఓటు (చాలా విలువైనది)
శ్రీరామ : ఎనిమల్ ,
రాజ్ : ఎనిమల్,విజయ : ఎనిమల్

మరోసారి ఆశీర్వదించండి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



24వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక 24వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేసీ కెనాల్, లక్ష్మీనగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధి గురించి వివరించారు. స్థానికులు చెప్పిన సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలు స్థానికంగా ఉన్న సచివాలయాల్లోనే అందుతున్నాయని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గతంలో పథకాల కోసం మండల, జిల్లా అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో పథకాలు పొందడం సులువుగా మారిందని చెప్పారు. సంక్షేమ ప్రభుత్వంపై టీడీపీ నేతలు అక్కసుతోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు ప్రజలు నమ్మరని వచ్చే ఎన్నికల్లో మరోసారి తమ పార్టీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ ఆసీఫ్, రాజు, సునీల్, సుచరిత, అర్చన, అబ్బాస్ అలీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక పాత బస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యలతో పాటు వైద్యం, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలు ఉంటే తనను కలిసి పరిష్కారం పొందవచ్చన్నారు.

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



డిజేబుల్డ్ అవేర్‌నెస్ వాక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్) : 64 వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని నగర మేయర్ బీవై రామయ్య పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక 19 వ వార్డులోని మేయర్ క్యాంపు కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల యువసేన అసోసియేషన్ ఆధ్వర్యంలో డిజేబుల్డ్ అవేర్‌నెస్ వాక్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి రాజ్ విహార్ వరకు నిర్వహిస్తున్న దివ్యాంగుల ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.

నూతన జాతీయ విద్యావిధానంతో నష్టం

కర్నూలు సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానంతో విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఆ సంఘం 47వ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ నుంచి శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, రాష్ట్ర సహాయ మాజీ కార్యదర్శి నరసింహ ప్రసంగించారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. సమావేశంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు సాయిశ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్) : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. అమరావతిలోని స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యూఢిల్లీలోని జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు శనివారం స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల చట్టాల ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను దృష్టిలో ఉంచుకుని మహిళల కోసం ప్రత్యేక చట్టాలు వచ్చాయని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వాలు చేసిన చట్టాలను తెలుసుకోవాలన్నారు. న్యాయవాది పి.నిర్మల మహిళల ప్రాధాన్యత, జాతీయ మహిళా కమిషన్ పనితీరు, అశ్లీలత, వరకట్న హత్యలు, యాసిడ్ దాడులు, కిడ్నాప్, గృహ హింస చట్టం, నిర్భయ చట్టాల గురించి అవగాహన కల్పించారు. వివాహాలు, విడాకులు, ఆ తర్వాత భార్య పోషణ, ఆస్తిలో మహిళల హక్కులు, కార్మిక చట్టాలను వివరించారు. న్యాయవాది బి.మురళి మనోహర మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్ సత్వర న్యాయం కోసం పర్మనెంట్ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు ఐసీడీఎస్ జి.అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

కర్నూలు(సెంట్రల్): క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు నియోజకవర్గాల కోర్డినేటర్లను కోరారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నియోజకవర్గాల కోర్డినేటర్లు, వాటి అనుబంధ సంఘాల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తరువాత దేశంలో కాంగ్రెస్ పుంజుకుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మారెప్ప, పీసీసీ అధికార ప్రతినిధి ఎ.కరుణాకరబాబు, రాష్ట్ర ప్రధానకార్యదర్శులు లక్ష్మీనారాయణరెడ్డి, దామోదరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

10న వాల్మీకి కార్తీక వనభోజనం

కర్నూలు(న్యూటౌన్): ఈనెల 10వ తేదీ ఆదివారం కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ గుడి దగ్గర శ్రీనివాస గార్డెన్స్‌లో వాల్మీకి కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి బోయ సేవా సంస్థ నేతలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ భవాని ప్రసాద్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి కర్నూలులో ఉన్న వాల్మీకి కుల బంధువులందరూ సకుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీల్లో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం డీపీఓ నాగరాజునాయుడుకు ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో చాలా పంచాయతీల్లో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు నాలుగైదు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆర్‌యూ నూతన కమిటీ

కర్నూలు కల్చరల్: ఏఐఎస్ఎఫ్ రాయలసీమ యూనివర్సిటీ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి మునిస్వామి అధ్యక్షతన శనివారం వర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడిగా ఎం.రాజేష్, ఉపాధ్యక్షులుగా పవన్, మల్లికార్జున, అలీ అక్బర్, ప్రధాన కార్యదర్శిగా ధనలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా పి.భాస్కర్, మౌలాలి, వాణిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ వర్సిటీలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. వర్సిటీలో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా, నగర, ఆర్‌యూ నాయకులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేయించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): 45 సంవత్సరాలు దాటిన తరువాత ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సుశీలనేత్రాలయ ఆసుపత్రి డాక్టర్ సుధాకరరావు అన్నారు. శనివారం సమాచార శాఖ కార్యాలయ ఆవరణలో జర్నలిస్టుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గంగాధరరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ ప్రారంభించారు. అనంతరం సుశీల నేత్రాలయ వైద్యులు జర్నలిస్టులకు కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

అగ్రిగోల్డ్ బాండ్లు వాపసు తీసుకోండి

కర్నూలు (లీగల్) : అగ్రిగోల్డ్ బాండ్లను వాపసు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో డిసెంబర్ 4వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. రసీదులను చూపించి ఒరిజినల్ బాండ్లను తీసుకెళ్లాలని ఆయన కోరారు.

డాక్టర్ సీతారామయ్యకు ఘన సన్మానం



డాక్టర్ సీతారామయ్యను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): యురాలజికల్ అసోసియేషన్ (సొసైటీ ఆఫ్ జునైటో యురినరీ సర్జరీ) తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా ఎన్నికైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యురాలజి విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్యను శనివారం ఘనంగా సన్మానించారు. ఆసుపత్రిలోని ఆ విభాగ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ సీతారామయ్య సౌమ్యుడిగా ఉంటూనే అంచెలంచెలుగా ఎదిగి అసోసియేషన్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవడం గర్వకారణమన్నారు. ఆఆయన ఇంకా జోనల్, జాతీయ స్థాయికి ఎదగాలని కాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి, రిటైర్డ్ యురాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ రెడ్డి, యురాలజి విభాగ వైద్యులు డాక్టర్ ముత్యశ్రీ, డాక్టర్ రవితేజ, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



మృతి చెందిన తహేర్ అలీ

కర్నూలు : కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కటిక అబ్దుల్ రహిమాన్ కుమారుడు కటిక తహేర్ అలీ (24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన ఆటో నడుపుతూ కుటుంబానికి చేదుగా ఉండేవాడు. శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై కర్నూలు నుంచి స్వగ్రామానికి వెళుతూ బిర్లా గేట్ నుంచి గుత్తి పెట్రోల్ బంకు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మోటార్ సైకిల్ అదుపు చేసుకోలేక ఫుట్‌పాత్ డివైడర్ ఎక్కించి కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బంధువులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం ఉదయం తండ్రి సుల్తాన్ సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

కర్నూలు: కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మల్లెపోగు ప్రభాకర్ హత్య కేసులో నిందితుడిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మల్లెపోగు ప్రభాకర్ భార్య బిడ్డలను వదలి కొంత కాలంగా కర్నూలు బీక్యాంప్‌లోని పాడుబడిన క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ పెయింటర్ వృత్తి చేస్తూ జీవనం సాగించేవాడు. గత నెల 29వ తేదీ బిర్లాగేట్ వద్ద ఉన్న జ్యోతి రావు పూలే విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఇటుక పెళ్లతో దాడి చేసి హత్య చేశాడు. ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు టీవీ 9 కాలనీకి చెందిన బోయ నాగరాజుగా గుర్తించి అరెస్ట్ చేశారు. తన దగ్గర ఉన్న రూ.300 లాక్కోడానికి ప్రయత్నం చేస్తే ఇటుక పెళ్లతో దాడి చేసినట్లు నిందితుడు బోయ నాగరాజు అంగీకరించినట్లు సీఐ తెలిపారు.

ఈ రోజు

'రావణ పద్య' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'రావణ పద్య' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు చిన్మయ మిషన్ కార్యదర్శి టీవీ రత్న ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్ కాలనీలోని మిషన్ కేంద్రంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.


వ్యవసాయ సంక్షోభంపై సదస్సు

కర్నూలు(సెంట్రల్): ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను పురస్కరించుకుని ఆదివారం 'వ్యవసాయ సంక్షోభం–కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు' అనే అంశంపై నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి తెలిపారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆయన మాట్లాడుతూ..జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

కరాటే పోటీలు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో ఏపీ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల కరాటే టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి ఫయాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కరాటే క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. విజేతలకు నగర మేయర్ బీవై రామయ్య కప్ అందజేస్తారని తెలిపారు.

రైల్వే కాంట్రాక్టర్ కార్యాలయం సీజ్



రైల్వే కాంట్రాక్టర్ కార్యాలయాన్ని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): నంద్యాల–బేతంచెర్ల మధ్య జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనుల్లో అక్రమంగా గ్రావెల్ ఉపయోగిస్తుండటంతో పాణ్యం మండలం కౌలురు గ్రామంలో ఉన్న రైల్వే కాంట్రాక్టర్ కార్యాలయాన్ని అధికారులు సీజ్ చేశారు. రికార్డులను, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రెండు టిప్పర్లను కూడా సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. భూగర్భ గనుల శాఖ అధికారులు రాజగోపాల్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు నవీన్, మురహరి, తిరుపతిరావు తదితరులు తనిఖీలు చేయగా.. రైల్వే డబ్లింగ్ పనుల్లో అక్రమంగా గ్రావెల్ ఉపయోగిస్తున్నట్లు తేలిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజ్ చేసిన రెండు టిప్పర్లను పాణ్యం పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పామన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : కల్లూరు అర్బన్ 36వ వార్డు డ్రైవర్స్ కాలనీకి చెందిన 20 కుటుంబాలు శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఎమ్మెల్యే కాటసాని వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కాలనీలో ఎటువంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎస్.ఫాతిమాతో పాటు రజిత, రాజేశ్వరి, మహేశ్వరి, శైలజ, వరాలు, జ్యోతి, మహేశ్వరి, మస్తాన్ బి. నాగలక్ష్మమ్మ, భాను తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో 36వ వార్డు ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, పర్ల బుజ్జి, శ్రీనివాసులు, గోవిందు, రాము తదితరులు పాల్గొన్నారు.

జగనన్నది జనరంజక పాలన



వైఎస్ఆర్‌సీపీలో చేరిన వారితో కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

- ఎమ్మెల్యే సుధాకర్ సమక్షంలో జనసేన కార్యకర్తలు పార్టీలో చేరిక

కర్నూలు సిటీ: రాష్ట్రంలో వైఎస్ జగనన్న జనరంజక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కోడుమూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న సారథ్యంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఏపీ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కొత్త పరిశ్రమలు వస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు సైతం పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్ పాలన నచ్చి పలువురు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీ ఎందుకు స్థాపించారో ఆయనకే స్పష్టత లేదన్నారు. అందుకే చాలా మంది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో జనసేన యూత్ నాయకులు గిడ్డయ్య, భానుప్రసాద్, వై.సిద్దు, జి.భాస్కర్, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ ఎస్ సంజీవకుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి అవసరార్థులను ఆదుకోవాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎస్. సంజీవకుమార్ అన్నారు. కర్నూలు ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.27 లక్షలతో ఆయన రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధికి అంబులెన్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రయోజనాల కోసం మోడ్రన్ అంబులెన్స్‌ను రెడ్‌క్రాస్‌కు ఇచ్చామన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోకి కూడా వెళ్లి రక్తదాతలతో రక్తం తీసుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యంగా సమాజంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కూడా తలసీమియా రోగులకు, గర్భిణిలకు, రక్తహీనతతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మహేంద్రకుమార్, సభ్యులు శ్రీనివాసులు, అరుణ, బాలరాజు, మధుసూదన్, ఇల్లూరి నరసింహ, కేవీ సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా డీజేలు వాడితే చర్యలు



డీజే ఓనర్లకు తగు సూచనలు ఇస్తున్న రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా

కర్నూలు: పండుగలు, పర్వదినాలు, పెళ్లిళ్లు, ఊరేగింపులు జరుపుకునేవారు పోలీసు అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. కర్నూలు నగర పరిధిలోని డీజే ఓనర్స్, డీజే ప్లేయర్స్, నిర్వాహకులతో శనివారం సర్కిల్ కార్యాలయంలో సీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించి డీజే నిర్వాహకులకు తగు సూచనలు జారీ చేశారు. పెళ్లిళ్ల, ఊరేగింపుల సందర్భంగా ఎక్కువ సౌండ్ పెట్టుకుంటూ అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు దారితీసే పరిస్థితులను వివరించారు. డీజే పెట్టుకునేందుకు ముందు ప్రభుత్వానికి తగిన చలానా చెల్లించి పోలీసు అనుమతి పొందిన తర్వాతే వినియోగించాలని సూచించారు. రాత్రి 9:30 గంటల తర్వాత డీజేల సౌండ్‌తో పాటు వాటి లైట్లను ఖచ్చితంగా నిలిపివేయాలని, పోలీసు సూచనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దాసుపత్రికి అవార్డులు రావడం గర్వకారణం



సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డికి అవార్డు చూపెడుతున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఎయిడ్స్ నియంత్రణలో ఉత్తమ సేవలకు గాను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రెండు రాష్ట్రస్థాయి అవార్డులు అందజేయడం గర్వకారణమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. అవార్డులు వచ్చిన సందర్భంగా శనివారం ఆయనను ఆయా విభాగాల వైద్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏటా డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అందజేసిన రాష్ట్రస్థాయి అవార్డులు కర్నూలు మెడికల్ కాలేజి, ఆసుపత్రికి లభించాయన్నారు. ఉత్తమ అవార్డుగా ఐసీటీసీ ఓపీ నెం.39, స్టేట్ రిఫరెన్స్ లేబరేటరీ(ఎస్ఎల్ఆర్) మైక్రోబయాలజి విభాగాలకు ఈ అవార్డులు వరించాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ రేణుకాదేవి, ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, డాక్టర్ హరిత, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.